# ప్రేమించే మనసు

ప్రేమించే మనసుండాలే గాని, సృష్టిలో ఎవరయినయినా, దేన్నయినా అవలీలగా ప్రేమించి పారేయొచ్చు అంటారు. విశ్వ ప్రేమికులు. కానీ, మనలో చాలా మంది విశ్వ ప్రేమికులు కాదు గద. కనీసం వీధి ప్రేమికులం కేడా కాలేము. సొంత భార్యని పిల్లల్ని ప్రేమించే మన మనసులు పరాయి వ్యక్తి అనే సరికి రసాయనకి మార్పు చెంది ద్వేషిస్తుంది. కానీ ప్రేమించడంలో తమతమ భేదాలనన్నిటిని చెరిపి వేసి జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ప్రేమించగలిగే వీర ప్రేమికులున్నారని ఈ మధ్యనే నాకు తెలిసింది. పక్కింటి ఇల్లాల్ని ప్రేమిస్తున్న ఓ విశ్వ ప్రేమికుడు, ఒకరోజు ఆవిడ భర్తని చూసి , ఆవిడే అనుకుని గాలిలో చేతులు వూపి ముద్దులు కురిపించి ప్రేమని ప్రదర్శించాట్ట. కానీ ఆవిడ భర్త వీరిలాగా విశ్వ ప్రేమికుడు కాకపోవడం చేత, అపార్థం చేసుకుని జాలిపడి బాల్కనీలోకి వచ్చి ' లోపలికి వెళ్ళి విశ్రాంతి తీసుకోండి – మందులు వాడుతున్నారా ' అనడిగాట్ట. దాంతో ఈ విశ్వ ప్రేమికుడు కంగారు పడి ' సారీ ', మీరా మీ ఆవిడనుకున్నా ' అన్నాట్ట. అక్కడి నుంచి మొదలైంది ప్రేమ గోల. ఆ రోజు నుంచి ఆ వీధి వీధంతా అట్టుడికి పోతుంది. నాకంతా సమానమే, నే అందర్ని ప్రేమిస్తానంటూ కాకిగోల పెడుతున్నాట్ట ఈ విశ్వ ప్రేమికుడు, వాళ్ళింట్లో పని మనిషి దగ్గరికి జూకామల్లె చేత్తో పుచ్చుకుని వెళ్ళి మోకాళ్ళపై భక్తిగా నిలబడి " నువ్వే నా ప్రాణం. నీవు లేకుండా నా బతుకే వ్యర్థం " అన్నాట్ట. పనిమనిషి పని మానేసి పరిగెత్తి పారిపోయిందిట. అక్కడితో ఆగకుండా, నాకు ప్రేమించడానికి లింగ భేదం అడ్డురాదని ప్రకటించడంతో ఆ ఇంటి ఛాయలకి నరమానవుడు పోవడం లేదట. పాలవాళ్ళు, పోస్టువాళ్ళు కూడా తెల్లవారకముందే సరకుని వారి గడపలో పెట్టి గాయిబయి పోతున్నారట. చుట్టాల రాకపోకలు ఆగిపోతున్నాయి. పేపరు వాళ్ళకి తెలిసి విలేకరుల ఇంటర్వ్యూ కావాలని ఫోన్లో అడిగితే " పిరికి సన్నాసులని వాళ్ళపైన జాలిపడి ఏం కావాలో అడగండన్నాట్ట. వున్నట్టుండి మీ కింత ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందంటే, నాకు ప్రేమించే మనసుంది. అంచేత ప్రేమించి పారేస్తానన్నాట్ట. దీంట్లో రాజీ ప్రసక్తి లేదన్నాట్ట. ఈ విశ్వమంతా

ఒకే కుటుంబం. మనమందరం బాగా కావాల్సిన వాళ్ళం. అంచేత కంటబడితే ప్రేమించేది ఖాయం అంటూ అసలు ప్రేమిస్తే తప్పేమిటీ ? అనడిగాట్ట. అదే మాటని పతాక సినిమాగా తీద్దామని ' ప్రేమిస్తా జాగ్రత్త ' అనే టైటిల్ని రిజిష్టరు చేసి యదార్ధ గాధల్ని కళ్ళకు కట్టినట్టు చెప్పగలిగే ఒక రచయితని చేత్తో పుచ్చుకుని ఈ విశ్వ ప్రేమికుడి కొంపకి వెళ్ళారట. వీళ్ళిద్దర్ని చూడగానే ఆ విశ్వ ప్రేమికుడు గబాల్న కావలించకుని ఇన్నాళ్ళూ ఏమైపోయారని ఆత్మీయంగా ఆరా తీసాట్ట. యదార్ద గాధల రచయిత తెలివిగా వారిని బుజ్జగించి డాక్టరు దగ్గరకి తీసుకుపోయాట్ట. ఆ డాక్టరు గారు మోహానికి గుడ్డ కట్టుకుని ( పేషెంటు ప్రేమిస్తాడనే భయంతో ) కూలంకషంగా పరీక్షించి ఇదో కొత్త రకం జబ్బని, పైగా అంటు వ్యాధని తేల్చి చెప్పి, రోగిని గాజు గోడల గదిలో వుంచాలని, ఆహారం , నీళ్ళు , మందులు స్వయంగా కాకుండా ప్రత్యేక పద్దతిలో ఇవ్వాలని, అజాగ్రత్తగా వుంటే, ఈ వ్యాధి అందరికీ వ్యాపించి ఎవరు ఎవర్ని ఎందుకు ఎపుడు ఎలా ప్రేమిస్తారో తెలీని అయోమయంలో పడిపోతాం అంటుండగానే , యదార్ధ గాధల రచయిత గారు వార్డు బాయ్ వెంట పడ్డారట. బుల్లి నిర్మాత గారు నర్సును చూసి ' స్వప్న సుందరీ ' ఇక్కడున్నావా – నువ్వే నా హీరోయిన్ అంటుండగా ' డాక్టరుగారికి స్పృహ పోయిందట. అంచేత తర్వాత ఏం జరిగిందో నాకు చెప్పలేక పోయారు.

అయ్యా ! ఇదంతా ప్రేమించే గుణం శృతి మించి పాకాన పడితే జరిగే తంతు. అసలు మనకి ప్రేమించే మనసేగాని లేకపోతే పర్యవసానం ఎలా వుంటుందో తెలుసుకోవాలంటే జరుగుతున్న చరిత్ర సాక్షి. ముక్కుపచ్చలారని కుర్రాళ్ళు నడివీధిలో ఆత్మాహుతి చేసుకుంటారు. అభం శుభం తెలీని అమాయక ప్రయాణికులు సజీవ దహనం చేయబడతారు. పట్టపగలు మతాల పేరిట మారణ హోమం సాగిస్తారు. .... సాటి వాడి కష్టాల్ని , కన్నీళ్ళని , కలతల్ని సహృదయంతో అర్ధం చేసుకుని కలిసి జీవించ లేకపోతే మనం మనుషులం కాము. ప్రయాణిస్తున్న పడవని, కూర్చున్న కొమ్మని నరుక్కొనే వాడు మూర్ఖుడు. కులాల పేరిటా , మతాల పేరిట కుమ్ములాడుకుని విడిపోతే మనమూ అంతే. అంచేత సహ జీవనం సజావుగా సాగాలంటే, ప్రేమించే మనసుతో పాటు త్యాగం చేసే మనసు కూడా కావాలి..... ఆలోచించండి మరి !

------- అయ్యిపోయింది -------